సాక్షి చిత్తూరు

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



బోయకొండలో రాహుకాల అభిషేకం

బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. - 8లో



పట్టపగలే భారీ చోరీ

పెనుమూరు మండలం కలవకుంట గ్రామంలోని ఓ ఇంట్లో శుక్రవారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. - 8లో



పల్లెకు నాణ్యమైన 'పవర్'

గ్రామీణ ప్రాంతాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. - 8లో

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారు



చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శుక్రవారం ఈ మేరకు పర్యటన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. వివరాలు ఇలా..

- 26వ తేదీన గన్నవరం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమానంలో బయలుదేరి ఉదయం 9.35 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9.45కి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.25 గంటలకు కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.30 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 10.40 గంటలకు రాజుపేట గ్రామ సమీపంలో హంద్రీ–నీవా కాలువ వద్దకు చేరుకుంటారు. అక్కడ పూజలు నిర్వహించి కాలువలో నీటిని విడుదల చేస్తారు.
- అనంతరం రోడ్డు మార్గంలో బయలుదేరి 11 గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.15 గంటలకు శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె చేరుకుంటారు.
- 11.25 గంటలకు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం 1.10 గంటలకు సభాస్థలి నుంచి హెలీప్యాడ్‌కు చేరుకుని, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు.
- 2.20 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి జిల్లా రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో గన్నవరానికి తిరుగుప్రయాణమవుతారు.

న్యూస్‌రీల్

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ముఖ్యమంత్రి పర్యటించనున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. హెలీప్యాడ్, పార్కింగ్, బహిరంగ సభ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. సభకు హాజరయ్యే ప్రజలకు భోజన వసతి కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్పీ జాషువా, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఏఎస్పీ ఆరీఫుల్లా పాల్గొన్నారు.

ఏప్రిల్ 5 వరకు పాలిసెట్ దరఖాస్తులు



జగన్నాథరావు, జిల్లా కో–ఆర్డినేటర్

కుప్పంరూరల్ : పాలిసెట్‌కు ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్, కుప్పం పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 10వ తరగతి పాసైనా లేక, పది పరీక్షలు రాసిన వాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కుప్పం పాలిటెక్నిక్‌లో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సమావేశంలో అధ్యాపకులు ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.


400 మంది మహిళలకు ఉద్యోగాలు



ఇంటర్వ్యూ చేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

నింద్ర: స్థానిక అమ్మయప్పన్ పరిశ్రమలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించి 400 మంది మహిళలకు ఉద్యోగావకాశం కల్పించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపీపీ దీప మాట్లాడుతూ మంత్రి రోజా సహకారంతో ఎంఎస్‌వీఎం పురంలో నెలకొల్పిన అమ్మయప్పన్ వస్త్ర పరిశ్రమలో మొత్తం 3 వేల మందికి మహిళలకు ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్ మట్లాడుతూ జాబ్‌మేళాకు మొత్తం 570 మంది హాజరుకాగా, 400 మంది ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, కో–ఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సింగల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్ బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో విధుల నిర్వహణ



ప్రశంసాపత్రం అందిస్తున్న హోంగార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్

చిత్తూరు అర్బన్: హోంగార్డులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కర్నూలు రేంజ్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం చిత్తూరులోని ఏఆర్ కార్యాలయంలో దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న బీమా, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులో భాగస్వామ్యం కావాలని సూచించారు. పోలీసులతో సమానంగా హోంగార్డులు ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పనిచేస్తున్నారని వెల్లడించారు. అనంత రం ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీలు ఇలియాస్ బాషా, మహబూబ్‌బాషా, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

27 నుంచి టెట్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : టెట్ పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సీతమ్స్, ఎస్వీసెట్, వేము, మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను aptet.apcfss.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

మగ్గం మురిసె!



నగరి బస్టాండ్ వద్ద సంబరాలు చేసుకుంటున్న మరమగ్గాల నిర్వాహకులు, కార్మికులు

నేత పరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారు.. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రోత్సాహం అందిస్తున్నారు.. గత టీడీపీ హయాంలో మరమగ్గాల నిర్వహణకు గుదిబండగా మారిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.. దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న బడుగు బతుకులకు జీవం పోశారు.. వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపారు. ప్రభుత్వ నిర్ణయంపై నేతన్నలకు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాట చెల్లించిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని స్పష్టం చేస్తున్నారు.. సమస్య పరిష్కారానికి చొరవ చూపి మంత్రి రోజాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

- విద్యుత్ బిల్లుల తగ్గింపు జీఓపై నేత కార్మికుల హర్షం
- ఇచ్చిన హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రిపై ఉప్పొంగిన అభిమానం
- రుణపడి ఉంటామంటున్న మరమగ్గాల నిర్వాహకులు
- మిఠాయిలు పంచి.. బాణసంచా పేల్చి సంబరాలు

నగరి : మరమగ్గాలకు విద్యుత్ బిల్లులు తగ్గిస్తున్నట్లు ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 31పై మరమగ్గాల నిర్వాహకులు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఈ మేరకు నగరి బస్టాండు ప్రాంగణంలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జైజగన్..జై రోజమ్మ అంటూ నినాదాలు చేశారు. నేత సామాజికవర్గానికి చెందిన మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం పోతూపోతూ మరమగ్గాలకు కేటగిరీ మార్చేసిందని ఆరోపించారు. దీంతో మగమగ్గాలపై మోయలేని భారం పడిందన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాన్ని మంత్రి ఆర్‌కే రోజా, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి దృష్టికి తీసుకెళ్లనట్లు వెల్లడించారు. ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించిన మంత్రి రోజా తమ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వివరించి పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. నగరిలో విద్యాదీవెన పథకం నిధుల విడుదల సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగనన్న స్పందిస్తూ విద్యుత్ బిల్లుల తగ్గింపుపై ప్రకటన చేశారని, ఇప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చారని వివరించారు. రూపాయి ఉన్న ఎలక్ట్రిసిటీ డ్యూటీని 6 పైసలకు తగ్గిస్తూ జీఓ విడుదల చేశారని వెల్లడించారు.



స్వీట్లు పంచుకుంటున్న నేత సామాజికవర్గం నేతలు

కష్టాలు తెలిసిన నేత



ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతో పాటు మా లాంటి మరమగ్గనేత కార్మికుల కష్టాలు తెలిసిన నేత సీఎం జగనన్న. మా సమస్యలపై దృష్టి సారించి సాయపడుతున్న నిజమైన ప్రజా నాయకుడు. ఎలక్ట్రిసిటీ డ్యూటీ తగ్గించడం ద్వారా పార్టీలకు అతీతంగా అందరికీ లబ్ధి చేకూరుతుంది. ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– జీఎస్ విజయకుమార్, మరమగ్గం కార్మికుడు, సత్రవాడ

ఊపిరి పోశారు



కోవిడ్ కారణంగా ఏడాది పాటు ఆర్డర్లు లేకుండా దెబ్బతిన్నాం. పనిలేక విలవిలలాడాల్సిన పరిస్థితి. ఆ సమయంలో ప్రభుత్వం స్కూల్ పిల్లల యూనిఫామ్ ఆర్డర్లు ఇప్పించి పనికల్పించింది. మంత్రి రోజా అహర్నిశలు అండగా ఉంటూ వ్యాపార నిమిత్తం చెన్నైకి వెళ్లేందుకు పలు రైళ్లు నడిచేలా చేశారు. ఇప్పుడు మరమగ్గం నేతకు ఊపిరి పోశారు.

– బాబు, మరమగ్గం నిర్వాహకుడు, ఏకాంబరకుప్పం

ఇంత కంటే ఏం కావాలి



నేత సామాజికవర్గానికి ఇంతగా మేలు ఏ పార్టీ ఏదీ లేదు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆర్డర్ల ద్వారా పలువురికి పని కల్పించారు. మా సామాజివర్గానికి చెందిన 2,650 మందికి పెన్షన్లు ఇస్తున్నారు. మా నివాసిత ప్రాంతంలో అర్బన్ హెల్త్ సెంటర్ పెట్టి నాణ్యమై వైద్యసేవలు అందిస్తున్నారు. 60 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో విద్యుత్ భారం కూడా తగ్గించారు. ఇంత కంటే మాకు ఏం కావాలి.

– ఈవీ బాలకృష్ణన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్, సత్రవాడ

మేలు మరువలేం



మా పరిస్థితిని మంత్రి ఆర్‌కే రోజా వివరించిన వెంటే అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలక్ట్రికల్ డ్యూటీ తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. నేడు ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో ముఖ్యమంత్రి చెప్పినవి వట్టిమాటలు కాదని అందరికీ అర్థమైంది. ఆయన చెప్పారంటే.. చేస్తారంతే. జగనన్న మేలు మరువలేం.

– ఏఈ క్లౌసెల్వన్, మగ్గం కార్మికుడు, రామ్‌నగర్.సి, నగరి

పరిశ్రమకు చేయూత



మరమగ్గం పరిశ్రమను అభివృద్ధి పథంలో నడపడానికి ప్రభుత్వం చేయూత అందిస్తోంది. గతంలో యూనిఫామ్ ఆర్డర్లు ఇప్పించి పని కల్పించింది. ప్రస్తుతం ఎలక్ట్రిసిటీ డ్యూటీని తగ్గించింది. ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలకు అందించే దుస్తుల ఆర్డర్లను మరమగ్గాలకు అందించేందుకు మంత్రి రోజా ఎంతో కృషిచేస్తున్నారు.

– శంకర్, మరమగ్గం నిర్వాహకుడు, పుత్తూరు

భారం తగ్గుతుంది



ప్రస్తుతం వచ్చే విద్యుత్ చార్జీల భారంలో యూనిట్‌కు 94 పైసలు చొప్పున తగ్గుతుంది. పవర్‌లూమ్ కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. మా ఇంటి కోడలైన మంత్రి రోజా మా ఉన్నతి కోసం తన వంతు సాయం ఎప్పుడూ అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నారు.

– ఎ.రవి, మరమగ్గం కార్మికుడు, పుదుపేట

బాల్య వివాహాల నివారణే లక్ష్యం

చిత్తూరు రూరల్: బాల్యవివాహాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. శుక్రవారం చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బేటీ బచావో...బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ బాల్య వివాహాల కారణంగా వచ్చే నష్టాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. చిన్నవయసులో పెళ్లి చేయడం వల్ల మాతృమరణాలు సంభవిస్తున్నాయని, శారీరక సమస్యలు సైతం తలెత్తుతున్నాయని వివరించాలని సూచించారు. తల్లిదండ్రులు చైతన్యవంతమైతే బాల్య వివాహాల నివారణ సాధ్యమని వెల్లడించారు.

సమ న్యాయం.. సంక్షేమం

పుత్తూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ.. సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. శుక్రవారం వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో నిర్వహించిన ఇంటి పట్టాల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. మొత్తం 428 మందికి పట్టాలు అందించారు. మంత్రి మాట్లాడుతూ ఆడపడుచుల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగనన్న నెరవేరుస్తున్నారన్నారు. 90 రోజుల స్కీమ్‌లో అర్జీలు పెట్టుకున్న అర్హులందరికీ ఇంటి పట్టాలు అందిస్తున్నామని వెల్లడించారు. మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందని, ఈరోజు పట్టాలు అందుకున్న వారందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. . టీసీ అగ్రహారంలో మరో జగనన్న కాలనీని నెలకొల్పనున్నట్లు తెలిపారు.పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని, అన్ని రంగాల్లో మహిళలను ఆదుకుంటున్నారని వివరించారు. ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ. 25,570 కోట్లతో అక్కచెల్లెమ్మలకు ఆర్థికంగా బలోపేతం చేశారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న మంత్రి వర్గంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజసింహసరేంద్ర, ఎంపీడీఓ సుజాతమ్మ, ఎంపీపీ విజయలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నేతలు యాదవేంద్రరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, కరుణాకర్‌చౌదరి, సురేష్‌రాజు, లోకేష్, శేఖర్, కిరణ్‌కుమార్, చంద్రారెడ్డి, నందయ్య, మంగారెడ్డి, కృష్ణారెడ్డి, రవిరెడ్డి, పుల్లయ్య, శ్రీవిద్య పాల్గొన్నారు.



ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులతో మంత్రి రోజా

వరసిద్ధుని హుండీ లెక్కింపు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న మోహన్ రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారి హుండీ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. మొత్తం 16 రోజులకు గాను స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.97లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. అందులో 38 గ్రాముల బంగారం , 950 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ సైతం ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'బేటీ బచావో'

చిత్తూరు కలెక్టరేట్ : బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యతని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. శుక్రవారం చిత్తూరులోని డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామ సభలలో బాల్యవివాహాల నిర్మూలన అంశంపై అజెండా పెట్టి చర్చించాలని ఆదేశించారు. చిన్నపిల్లలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టాలను వివరించారు.

రేపే గ్రూప్–2 పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 కేంద్రాల్లో ఈ నెల 25వ తేదీన గ్రూప్–2 పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య వెల్లడించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపైసమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 9,441 మంది పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. అభ్యర్థులు ఉదయం 10.15లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు కొనసాగుతాయని వివరించారు.

జనమే సైన్యంగా పోరు

బైరెడ్డిపల్లె : జనమే సైన్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల పోరుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శుక్రవారం మండలంలోని బేలుపల్లెలో సిమెంటు రోడ్డు, అదనపు తరగతిగదులు, కమ్యూనిటీ భవనం, గంగినాయనపల్లె సచివాలయ పరిధిలోని పిచ్చిగుండ్లపల్లె గ్రామానికి సిమెంటురోడ్డు, కమ్మనపల్లెలో అదనపు తరగతులు, జాలారిపల్లె, ధర్మపురి, చప్పిడిపల్లె, నెల్లిపట్ల, కడపనత్తం, వెంగంవారిపల్లె, కొత్తయిండ్లు, లక్కనపల్లె, గౌనితిమ్మేపల్లె, కుప్పనపల్లె, తీర్థం, దేవదొడ్డి గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జనం గుండెల్లో గూడు కట్టుకున్న జగనన్నపై కట్టకట్టుకుని ప్రతిపక్షాలు వస్తున్నాయని, దమ్ము, పౌరుషం ఉన్న నాయకుడు కాబట్టే ఒంటరిగా ఎన్నికల బరిలో ఉన్నారని వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించామని తెలిపారు. పలమనేరు నియోజకవర్గంలో గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి గతంలో ఎలా ఉండేదో.. ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలే ఆలోచించాలని సూచించారు. ఎన్నికలు సమీపించడంతోప్రతిపక్ష నేతలు వచ్చి మభ్యపెడుతున్నారని, అలాంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలని వెల్లడించారు. చంద్రబాబు పెత్తందార్ల కోసం పనిచేస్తే జగనన్న పేదల తరఫున పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్టీ ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

క్లుప్తంగా

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు



ఏపీపీఎస్సీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గ్రూప్–2 పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని ఏపీపీఎస్సీ సభ్యుడు సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల 25 వ తేదీన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 10.15 గంటల లోపు కేంద్రాలకు తప్పనిసరిగా చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించమని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఒకసారి డీబార్ అయితే 5 నుంచి 10 ఏళ్ల వరకు ప్రభుత్వం నిర్వహించే ఎలాంటి పరీక్షలకు అనర్హులవుతారని వివరించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.1.5లక్షల మద్యం స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఉలసయ్య వివరాలు వెల్లడించారు. ఇరువారం బ్రిడ్జి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అన్సర్ (27) అనే వ్యక్తి కర్ణాటక మద్యంతో పట్టుబడ్డాడని తెలిపారు. మద్యంతో పాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే పాండ్యా, లడ్డు అనే మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు.

పల్లెకు నాణ్యమైన 'పవర్'

పల్లెలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కానుంది. సింగిల్ ఫేస్ కష్టాలకు తెరపడనుంది. నిరంతరాయ కరెంట్ అందుబాటులోకి రానుంది. లో ఓల్టేజ్ సమస్యకు చెక్ పడనుంది. ఈ క్రమంలోనే వ్యవసాయానికి ప్రత్యేక లైన్ ఏర్పాటు కానుంది. పరిశ్రమలకు కోతల్లేకుండా కరెంట్ అందించేందుకు మార్గం సుగమమవుతోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలించింది. కేంద్రం రూ.1,416 కోట్లను గ్రాంట్ కింద విడుదల చేసింది. ఈ మేరకు అధికార యంత్రాంగం పనులను సైతం ప్రారంభించింది.

- వ్యవసాయానికి ప్రత్యేక లైన్
- పరిశ్రమలకు 24 గంటలు సరఫరా
- రూ.1,416 కోట్లతో పనులు



జీడీనెల్లూరులో పోల్ టు పోల్ సర్వే చేస్తున్న సిబ్బంది

చిత్తూరు కార్పొరేషన్ : గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటి వరకు సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఫలితంగా పరిమిత వ్యవధిలోనే మంచినీటి సరఫరా జరుగుతోంది. చాలా గ్రామాలు ఏళ్ల తరబడి లోఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇంతవరకూ జిల్లా, మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే త్రీఫేస్ విద్యుత్ సరఫరా అవుతోంది. అందుకే పల్లెల్లో అవసరాలకు తగ్గట్టు భూములున్నప్పటికీ పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపడంలేదు. పట్టణాలు, నగరాల వైపే తరలిపోతున్నారు. ఇలాంటి పరిస్థితులను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దీని పరిష్కారానికి చొరవ చూపింది. ముందుకు వచ్చే రాష్ట్రాలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ అందజేస్తోంది.

గుజరాత్ తరహాలో..

నరేంద్రమోదీ సీఎంగా ఉన్న సమయంలో గుజరాత్‌లో విజయవంతంగా అమలు చేసిన రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్‌ఎస్)ను కేంద్రం చిత్తూరు ఉమ్మడి జిల్లాకు సైతం మంజూరు చేసింది. ఈ స్కీమ్ ద్వారా గ్రామాల్లో 24 గంటలూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు అవకాశం కలగనుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1416 కోట్లు కేటాయించింది. ఈ నిధుల్లో 60 శాతం కేంద్రం గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఇస్తోంది. మిగిలిన 40 శాతం కూడా ఇంటర్నల్ గ్రాంట్ నుంచి విడుదల చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ స్కీమ్ మన జిల్లాకు దక్కింది.

అన్నింటికీ సరఫరా

ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో భాగంగా గ్రామాలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వ్యవసాయ రంగానికి ప్రత్యేక ఫీడర్లతో డెడికేటెడ్ విద్యుత్ లైన్లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా చేసే సమయంలో చిన్న, మధ్యతరహా, కుటీర పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు ఒకేసారి విద్యుత్ సరఫరా చేసే వెసులుబాటు ఈ స్కీమ్ ద్వారా దక్కనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఎస్పీడీసీఎల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన ఆర్‌డీఎస్‌ఎస్ పనులను చేపడుతోంది.

చివరి దశకు సర్వే

ప్రాజెక్టులో భాగంగా తొలి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌డీడీఎస్‌ఎస్ పథకంలో మొత్తం 890 గ్రామీణ ఫీడర్లకు గాను 825 ఫీడర్ల సర్వే పనులు పూర్తి చేశారు. దాదాపు 95 శాతం వరకు సర్వే పూర్తయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలో 41 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ సబ్‌స్టేషన్లలో మిశ్రమ ఫీడర్ల ద్వారా వ్యవసాయ, గృహ, వాణిజ్య, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఇందులో 30 శాతానికి ఎక్కువ వ్యవసాయ సర్వీసు ఉండే ఫీడర్లను వేరు చేయనున్నారు. అలాగే వ్యవసాయానికి ప్రత్యేకంగా లైన్ ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

డివిజన్	సబ్‌స్టేషన్లు	ట్రాన్స్‌ఫార్మర్లు	వ్యవసాయ ఫీడర్లు
తిరుపతి ఆపరేషన్	33	6,619	14
తిరుపతి రూరల్	49	19,354	120
పుత్తూరు	73	25,597	197
చిత్తూరు అర్బన్	41	13,819	107
చిత్తూరు రూరల్	24	14,331	76
మదనపల్లె	47	23,710	145
పీలేరు	50	20,098	118
పుంగనూరు	108	31,429	245

వచ్చే ఏడాదిలోపు పూర్తి

వచ్చే ఏడాది చివరికి ఆర్‌డీఎస్‌ఎస్ స్కీమ్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సర్వే పనులు అయ్యాక డీపీఆర్‌కు అనుగుణంగా లైన్లు వేయనున్నాం. దీంతో వ్యవసాయానికి పగలే 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. పల్లెలో త్రీఫేస్ విద్యుత్ లైన్లకు ఏర్పాటు కానుండడం మంచి పరిణామం.
– కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారితో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

గుడుపల్లె : స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం 25 మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కోడిగానిపల్లెకు చెందిన మునెప్ప, మాలవానికొత్తూరుకు చెందిన శీనప్ప, మిట్టూరుకు చెందిన టీడీపీ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు నాసిర్ ఆధ్వర్యంలో షబ్బీర్. సిరాజ్ వినాత్ సురేష్‌తో పాటు పలువురు నేతలు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీలో ఏళ్ల తరబడి పనిచేసినా గుర్తింపు లేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని వెల్లడించారు. ఇలాంటి ప్రభుత్వమే ప్రజలకు అవసరమని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ, కో–కన్వీనర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బోయకొండలో రాహుకాల అభిషేకం



ఉభయకర్తలకు తీర్థప్రసాదం అందిస్తున్న నాగరాజరెడ్డి, చంద్రమౌళి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఉపవాసదీక్షలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, సభ్యుడు రాజేష్, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కూరగాయలు వితరణ చేసిన పలమనేరుకు చెందిన సీఎస్ నవీన్‌కుమార్ మిత్ర బృందానికి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కీచక టీచర్‌కు దేహశుద్ధి

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇంగ్లిష్ ఉపాధ్యాయుడికి శుక్రవారం గ్రామానికి చెందిన యువకులు దేహశుద్ధి చేశారు. టీచర్ ప్రవర్తనపై విద్యార్థిని తన తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు గ్రామస్తులతో కలిసి పాఠశాలకు వెళ్లి టీచర్‌ను చితకబాదారు. విషయం తెలుసుకున్న డీఈఓ స్పందించి గంగాధరనెల్లూరు ఎంఈఓ గుణశేఖర్, మండల ఎంఈఓ–2ను విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈమేరకు వారు గిరిజ బలిజకండ్రిగ హైస్కూల్‌కు వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. ఇంగ్లిష్ టీచర్ ప్రవర్తనపై విద్యార్థినులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.



విచారణ నిర్వహిస్తున్న ఎంఈఓలు

పట్ట పగలే భారీ చోరీ

– రూ.7లక్షల నగదు, 50 గ్రాములు నగలు అపహరణ

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని కలవకుంట గ్రామంలో పట్టపగలే ఓ ఇంట్లో శుక్రవారం భారీ చోరీ చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన విశ్రాంత బ్రాంచ్ పోస్టుమాస్టర్ రాజగోపాల్ పైపల్లి గ్రామం వద్ద ఇల్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇంటికి తాళాలు వేసి కొత్తగా నిర్మించుకుంటున్న ఇంటి వద్ద పనులు పర్యవేక్షణకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని సుమారు రూ.7లక్షల నగదు, 50 గ్రాములు బంగారు నగలు అపహరణకు గురైనట్లు తెలిసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు చిత్తూరు నుంచి వేలిముద్రల నిపుణులను రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఉమామహేశ్వర్ తెలిపారు.

పురపాలక పన్ను వసూలు చేస్తున్న కేటుగాళ్లు

పుంగనూరు : మున్సిపాలిటీకి కట్టాల్సిన పన్నులను కార్యాలయంలోనే చెల్లించాలని కమిషనర్ నరసింహప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బయట వారికి ఎవరికీ చెల్లించవద్దని, ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా పన్నులు చెల్లించవద్దని సూచించారు. ముఖ్యంగా ఆస్తిపన్ను, నీటి పన్ను, ట్రేడు లైసెన్సులు కార్యాలయంలోనే చెల్లించాలన్నారు. గత రెండు రోజులుగా కొంతమంది మోసగాళ్లు రెండు ఇళ్ల యజమానులకు ఫోన్ చేసి పన్నులు వసూలు చేయడంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ప్రజలు ఎలాంటి ఒత్తిడిలకు లొంగకుండా నేరుగా కార్యాలయాన్ని సంప్రదించి పన్నులు చెల్లించాలన్నారు. సుమారు రూ.1500లు వసూలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నాని వెల్లడించారు.



మోసగాడి ఫోన్‌పే ఐడీ

టీ 20 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక రేపు

నింద్ర: టీ 20 క్రికెట్ జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి అద్వైత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నింద్రలోని క్రికెట్ మైదానంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఎంపికల్లో ఆసక్తిగల యువకులు పాల్గొనాలని కోరారు. వివరాలకు 8374543595,7842635338 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

26న పలు ప్రారంభోత్సవాలు

చిత్తూరు కార్పొరేషన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెబ్‌నార్ ద్వారా ఈ నెల 26వ తేదీన పలు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు రైల్వే పీవే సెక్షన్ ఆఫీసర్ మధుసూదనయ్య శుక్రవారం తెలిపారు. అందులో భాగంగా పెనుమూరు వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి, చిత్తూరు, పాకాల స్టేషన్లకు నూతన భవనాల కేటాయింపు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆ రోజు చిత్తూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని వివరించారు.

జింక మృతి

బైరెడ్డిపల్లె : మండలంలోని లక్కనపల్లె వద్ద గడ్డిండ్లు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ జింక మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అటవీ ప్రాంతంలో జింక కళేబరాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది కుసుమ, రమేష్ పాల్గొన్నారు.

స్కూలు బస్సు కిందపడి చిన్నారి దుర్మరణం



సాత్విక (ఫైల్)

ఐరాల: మండలంలోని ఎగువ గూబలవారిపల్లెలో శుక్రవారం స్కూలు బస్సు కింద పడి ఓ చిన్నారి మృతి చెందింది. వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీహరి, లక్ష్మీదేవి దంపతులకు మోక్షశ్రీ(5), సాత్విక(3) అనే ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తెను పాకాల మండలం దామలచెరువుకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించారు. ఈ క్రమంలో గ్రామానికి వచ్చిన స్కూలు బస్సులో మోక్షశ్రీని ఎక్కించేందుకు సాత్విక తన అమ్మమ్మతో కలిసి వచ్చింది. పక్కన ఉన్న సాత్వికను డ్రైవర్ షామీర్ చూసుకోకుండా బస్సును కదలించడంతో చిన్నారి వెనుక టైర్ కింద పడిపోయింది. ఈ విషయాన్ని గమనించని డ్రైవర్ బస్సును మందుకు నడిపాడు. దీంతో సాత్విక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు..

పూతలపట్టు : మండలంలోని పి.కొత్తకోట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. తిరుపతి జిల్లా కొత్తపల్లెకు చెందిన పునీత్‌కుమార్(19), తిరుపతికి చెందిన అఫ్రీన్(19) స్థానికంగా ఓ ప్రైవేట్ కళాశాలలో బీసీఏ, బీకామ్ చదువుతున్నారు. కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి వెళ్లేందుకు ఇద్దరూ బైక్‌పై బయలదేరారు. మార్గం మధ్యలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుకనుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అఫ్రీన్ అక్కడికక్కడే మరణించింది. తీవ్రంగా గాయపడిన పునీత్‌కుమార్ చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కాలేజీ స్నేహితులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.




పునీత్‌కుమార్, అఫ్రీన్ (ఫైల్)

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ షేక్‌షావలీతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. పోలీసులు చేపట్టిన తనిఖీల్లో సాంబయ్య కండ్రి వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గంగాధరనెల్లూరుకు చెందిన చంద్రు(23), చిత్తూరు సీఎంటీ రోడ్డుకు చెందిన దిలీప్(23), తోటపాళ్యానికి చెందిన రామకృష్ణ(27)గా గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపించిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

108తో తమాషాలు..!



108 వాహనంలో నవ్వుకుంటూ కూర్చున్న రోగి

పలమనేరు : పట్టణంలోని జెండామఠానికి చెందిన చంద్రశేఖర్ శుక్రవారం వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. పురుగుల మందు తాగిన యువకుడిని 108 సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే చిత్తూరు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే రెఫర్ చేయబడిన పేషెంట్ మాత్రం 108 వాహనం ఎక్కి నవ్వుకుంటూ తుళ్లుకుంటూ ప్రయాణిస్తూ మీడియా కంటపడ్డాడు. ఫొటోలకు సైతం ఫోజులు ఇవ్వడం స్థానికులను ఆగ్రహానికి గురిచేసింది. అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలను కాపాడే 108ను ఇలా దుర్వినియోగం చేయడంపై పలువురు మండిపడ్డారు. ఎలాంటి ఇబ్బంది లేని వ్యక్తిని వైద్యులు ఎందుకు మరో ఆస్పత్రికి రెఫర్ చేశారో అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

BEFORE THE DEPUTY REGISTRAR OF CO-OPERATIVE SOCIETIES (U/R 441), ARBITRATION CELL SOUHARDA CO-OPERATIVE, KARNATAKA STATE SOUHARDA SAMYUKTHA SAHAKARI, BENGALURU

DISPUTE No. JRD/1388/2023-24

BETWEEN:
Sreenidhi Souharda Sahakari Bank Niyamitha, V.V. Puram Branch, Bengaluru-560 004.
Repted by its Branch Manager ... Petitioner

:: AND ::

Sri D. Chanti Reddy and anothers. .... Respondents

NOTICE TO THE RESPONDENT NO. 1

Sri. D. Chanti Reddy S/o D. Jayachandra Reddy Pandu, Aged about 35 years, Rlat Kondavaripalli Village, Pileru Mandalam, Annamayya District, Andrapradesh-517214.

Whereas, the Petitioner has instituted dispute Under Section 39 of Karnataka Souharda Sahakari Act, 1997 against the above referred Respondents. In the said dispute, the notice sent to the Respondent No. 1 i.e., Sri. D. Chanti was not served.

Hence, you are hereby summoned to appear in person or through a pleader on 05.03.2024 at 11.30 a.m to answer all material question relating to the above case, failing which, the matter will be heard and decided in your absence.

Given under my hand and seal of the Authority on 5th February, 2024.

By Order of the Authority